క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్

రైల్వేకోడూరు అర్బన్ : విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్ అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఉర్లగడ్డపోడు వైఎస్సార్ కాలనీలో జరిగిన నులిపురుగుల నివారణ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నులిపురుగు నివారణ మందులు ఇచ్చేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

రాజంపేట టౌన్ : పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సి.సుధాకర్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ ప్రతిమను ప్రత్యేక పుష్పాలతో, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ పురోహితులు విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే హోమం, అభిషేకాలు వంటి కార్యక్రమాలను చేపట్టారు.

రైతులకు పరిహారం చెల్లించాకే పనులు చేపట్టండి

గాలివీడు : ఎన్నో ఏళ్లగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారం చెల్లించాకే సోలార్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గాలివీడు మండలంలోని తూముకుంట గ్రామంలో రైతుల అనుమతి లేకుండా హెచ్‌పీపీఎల్ కంపెనీ ప్రతినిధులు పొలాలను చదును చేయడాన్ని వారు ఖండించారు. రైతులకు న్యాయం చేయకుంటే కార్యాలయాలు ముట్టడిస్తామన్నారు. పనులు జరపకుండా ఆందోళనలు చేస్తామన్నారు. చట్ట ప్రకారం రైతులకు ఇవ్వాల్సిన పరిహారం అందించడమే కాక భూమి కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అంతే మొత్తంలో భూములను అందించాలని పేర్కొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

రామాపురం : ఏఆర్ కానిస్టేబుల్ రేఖం కృష్ణయ్య ఆగస్టు 31న రోడ్డు ప్రమాదానికి గురై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి కృష్ణయ్య మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలను త్వరగా వచ్చేలా అధికారులకు సిఫారసు చేస్తామన్నారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని చెరువుకిందపల్లె హరిజనవాడకు చెందిన ఏపూరి రవితోపాటు వారి కుమారుడిని అదే గ్రామానికి చెందిన ఆరు మంది కొట్టి రక్తపు గాయాలు చేసినట్లు ఏపూరి రవి చేసిన ఫిర్యాదు మేరకు ఆరుమందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మురికినీరు విషయమై ఇరువురు పరస్పరం గొడవ పడినట్టు సమాచారం.

జీఓ-85ను రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు

ఓబులవారిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ-85ను వెనక్కు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ముక్కావారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు జీఓ వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ద్వారా వైద్యులకు ఇన్ సర్వీసు కోటాను 30శాతం నుంచి పది శాతానికి కుదించారన్నారు. దీని ద్వారా పీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

పోస్టల్ బీమా చేసుకోండి

చిట్వేలి : స్థానిక సబ్ పోస్టాఫీసులో మంగళవారం పోస్టల్ బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప జిల్లా డివిజన్ పీఎల్ఐ అభివృద్ధి అధికారి మునాఫ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25, 26వ తేదీలలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, గ్రామీణ ప్రాంత తపాలా, జీవిత బీమాలపై జరుగుతున్న మేళా గురించి గ్రామీణ ప్రాంతాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి సబ్ పోస్టు మాస్టర్ హరికృష్ణ, రమణ, రెడ్డయ్య, సిబ్బంది, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

సుండుపల్లె : పౌర్ణమి సందర్భంగా మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ, మిట్టబిడికిలోని గ్రామ దేవతలైన మారెమ్మ, కాళిక దేవీలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎస్‌జీఎఫ్‌లో విద్యార్థుల ప్రతిభ

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్జీఎఫ్ పోటీల్లో డాల్ఫిన్ డేల్ స్కూల్ విద్యార్థులు 12 మంది వివిధ ఆటల పోటీలలో పతకాలు సాధించారు. మంగళవారం విద్యార్థులను కరస్పాండెంట్ పంజం సుకుమార్ రెడ్డి అభినందించారు. అలాగే అథ్లెటిక్‌లో ఇరువురు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు.

అడ్డుకోవాల్సిన మంత్రి అవహేళన చేయడం సిగ్గుచేటు



పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత. దాన్ని ఆశయంగా తీసుకొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలు కూడా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉన్నత విద్య చదవాలనే లక్ష్యంతో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి నిర్మాణాలు చేశామన్నారు. మెడికల్ విద్య పేదలకు అందకుండా ధనమున్నవారే డాక్టర్లు కావాలని దుర్బుద్ధితో చంద్రబాబు పేదలు చదువుకోకుండా ఉండేందుకు కళాశాలను ప్రైవేటు పరం చేయడం దారుణం. దీనిని అడ్డుకోవాల్సిన ఆ శాఖ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ అవహేళన చేయడం సిగ్గుచేటు. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే. ప్రభుత్వం పునరాలోచించాలి.

– రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైస్ ఎంపీపీ, రైల్వేకోడూరు



ప్రైవేటుపరం ప్రభుత్వ అవివేకం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలలకు సీట్లు కేటాయించకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే. ప్రభుత్వ కాలేజీలలో సామాన్యులకు తక్కువ ఖర్చుతో వైద్య విద్యను పూర్తి చేసుకుంటే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పం, దూర దృష్టితో 17 వైద్య కళాశాలలను నిర్మిస్తే ఈ ప్రభుత్వం వాటికి సీట్లు ఇవ్వకుండా చేస్తోందంటే కూటమి ప్రభుత్వానికి పేదల చదువులపై ఉన్న చిత్తశుద్ధి తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కళాశాలలకు సీట్లు కేటాయించాలి.

– కవితారమేశ్‌రెడ్డి, జెడ్పీటీసి, సంబేపల్లె

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

- ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం
- అవగాహన ర్యాలీల్లో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు
- పరిసరాలను శుభ్రం చేసిన అధికారులు



రాయచోటి అర్బన్: బంగ్లాసర్కిల్‌లో రోడ్లను శుభ్రపరుస్తున్న డీపీఓ, మున్సిపల్ కమిషనర్ తదితరులు

రాయచోటి అర్బన్ : స్వచ్ఛ రాయచోటి సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి సల్పాలని డీపీఓ ధనలక్ష్మి, కమిషనర్ వాసుబాబులు అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. బంగ్లా సర్కిల్‌లో అధికారులు రోడ్లను శుభ్రపరచి స్వచ్ఛసంకల్పం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన నగరాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని శుభ్రంగా ఉంచడం అంటే భరతమాతకు సేవ చేసినట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి రెండుగంటలు పరిశుభ్రత కోసం పనిచేసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం కృషిచేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు. వైద్యులు కార్మికులకు వైద్యపరీక్షలను నిర్వహించి మందులను అందచేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ జి.వి.రమణారెడ్డి, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కొండయ్య, వైద్యులు రియాజ్‌బేగ్, కోటేశ్వరమ్మతో పాటు పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

ఓబులవారిపల్లె : పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మానవహారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించడమే స్వచ్ఛతా హీ సేవ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామ్మోహన్, ప్రధనోపాధ్యాయులు కె శ్రీహరి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటి కమిషనరు (ఎఫ్ఏసీ) కిషోర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలల్లో చైతన్య కలిగించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు కూండ్ల రమణారెడ్డి, మేనేజరు శేషఫణి, ఆర్ఐ హరి, టీపీఓ రత్నరాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. అంతకంముందుగా కమిషనరు కిషోర్, మేనేజరు శేషఫణి స్వయంగా చీపురు పట్టుకొని పరిశుభ్రత చర్యలను చేపట్టారు. అలానే ఆర్టీసీ బసాండులో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజరు రమణయ్య ఆధ్వర్యంలో బస్టాండు పరిసర ప్రాంతాలు, డిపోలో పిచ్చిమొక్కలను తొలిగించి, చెత్త చెదారాలను ఏరివేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది మోడపోతుల రమణయ్య, కండర్లు, డ్రైవర్లు, కార్మికులు, డిపో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ, స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని పాఠశాలలు, కార్యాలయాల్లో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు నాగనవీన్, సుబ్బరాయుడు, ఆశావర్కర్ భారతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : మంగళవారం చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాలలను శుభ్రపరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే గ్రామం మొత్తం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ అరుణ, ఉపాధ్యాయ బృందం, సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పుల్లంపేట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డిలు తెలియజేశారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పుల్లంపేటలో ఎంపీడీఓ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రోడ్లపై చెత్తా చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోగా పార్థసారథి, ఎంఈఓ చక్రాధర్ రాజు, ఏఓ హబీబుల్లా, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మణెమ్మ, విజయలక్ష్మి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రారంభించారు. చిట్వేలి గ్రామ పంచాయతీ నుంచి దండు లక్ష్మీ, ఎంపీడీఓ మోహన్‌లు ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో మానవహారం ఏర్పాటు చేసి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు.

విద్యార్థుల ర్యాలీ

వీరబల్లి : మండలంలో ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వంగిమళ్ల, ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించేలా ఈ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. వీరబల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు.

రామాపురం : గ్రామాలలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు విద్యార్థులతో కలిసి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, జయచంద్ర, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఏపీఎం దేవసేన, ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్య, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : దేశంలో స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి 10 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ పరిశుభ్రత కార్యక్రమాలు, అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు,స్పెషల్ ఆఫీసర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవలు పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, ఎంఈఓ-2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారంగా నిలిచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండకుంటే ఈగలు, దోమలు నిల్వ ఉండి దోమకాటు వలన విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని భారతదేశాన్ని స్వచ్ఛ దేశంగా ఏర్పరుచుకోవాలని తెలిపారు.



రాజంపేట: చీపుర్లు చేతపట్టిన కమిషనరు కిషోర్, మేనేజరు శేషఫణి



పుల్లంపేట: అప్పారాజుపేటలో పరిసరాలను శుభ్రం చేస్తున్న నేతలు, అధికారులు

ఆర్‌యూబీ పనులు పూర్తి చేయాలి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో ఆర్‌యూబీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 33 గ్రామాలకు, వేల మంది విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో రూ.10.60 కోట్ల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. తమ ప్రభుత్వంలో మంజూరై నిర్మాణ ప్రక్రియ ప్రారంభించామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, భరత్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

రాయచోటి అర్బన్ : గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలందరికీ జాబ్‌కార్డులను మంజూరుచేసి పనులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లానేత మావులూరి విశ్వనాథ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీనేతలతో కలసి డీఆర్ఓ సత్యనారాయణను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కనీస వేతనాల చట్టం ప్రకారం కూలీలు చెల్లించాలన్నారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకంలో తీసుకువచ్చిన మార్పులను వెంటనే రద్దుచేయాలన్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు సంబంధించిన వ్యవసాయ పనులను ఉపాధి పనులలో చేర్చాలన్నారు. కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇచ్చి వ్యవసాయ రుణాలు, పంట పెట్టుబడులు అందజేయాలన్నారు.

పోరాట యోధుడు ఏచూరి

ఓబులవారిపల్లె : సమాజం కోసం, ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని అన్నమయ్య జిల్లా సీఐటీయూ అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఏపీఎండీసీలో సీతారాం ఏచూరి మృతికి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏచూరి మృతి బడుగు బలహీన వర్గాలకు, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరలని లోటన్నారు. అనంతరం ఆయన మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోరాట జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, బండారు భాస్కర్, కుప్పల సుబ్రమణ్యం, ముత్యాల శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : సచివాలయం కార్యదర్శులు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఎగువ అబ్బవరం సచివాలయం భవనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాప్యం లేకుండా సేవలను ప్రజలకు అందించినప్పడే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిపైన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. సచివాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి నాయకులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు..

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

రాయచోటి టౌన్ : క్రీడల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఆలీమాబాద్ వీధిలో ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు తన సొంత నిధులు రూ.50 వేలు ఇస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆయన విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేశారు.

రైతుబజార్‌లో వ్యాపారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబ సెంటర్) : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని రాజీవ్ రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న 12 స్టాల్స్, ఐదు షాపులకు సైజు 10/20 జిల్లా సెలక్షన్ కమిటీ వారిచే అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు అర్హత గల డ్వాక్రా గ్రూపు, హోల్‌సేల్/రిటైల్ వ్యాపారస్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుండి 27వ తేదీలోగా దరఖాస్తు ఫారాన్ని మదనపల్లెలోని రాజీవ్ రైతుబజార్‌లో కానీ లేదా రాయచోటిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. కేటాయించిన స్టాల్స్, షాపుల సంఖ్య తగ్గించుట/పెంచుట, రద్దు చేసేందుకు జాయింట్ కలెక్టర్‌కు సంపూర్ణమైన అధికారం కలదని ప్రకటనలో పేర్కొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం



సుండుపల్లె: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న వైద్య సిబ్బంది

సంబేపల్లె : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఆశ వర్కర్లు లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలోని పింఛా జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఎంపీహెచ్ వీరనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గోర్లు కత్తిరించుకొని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎల్లమ్మ, ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ నాయక్, కృష్ణానాయక్, సుజాత, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న ఉచిత కంటి వైద్యశిబిరం

సిద్దవటం : ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఈనెల 22న ఒంటిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగునని వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి వల్లిచాన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం భాకరాపేటలో ఆయన మాట్లాడుతూ కంటికి సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తామన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకోవాలన్న వారు మాత్రమే శిబిరానికి రావాలన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరుగుతున్న ప్రాథమిక ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు తనను తాను ఉన్నతీకరించుకోవాలన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయుడు, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని యువకుడు మృతి

రాజంపేట : రాజంపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్యాణ్ (20) మృతి చెందాడు. మృతుడిది అనంతపురం జిల్లా ఉరవకొండ కాగా ప్రస్తుతం రాజంపేటలోని సింధూరి హోటల్‌లో పనిచేస్తున్నాడు. బైపాస్‌లో ఉన్న కొత్త హోటల్ వద్దకు బైక్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చికిత్స నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోని ఒంటిమిట్ట వద్దకు రాగానే కల్యాణ్ మృతి చెందాడు.

'మోడీ హయాంలోనే దేశం అభివృద్ధి పథం'



రైల్వేకోడూరు అర్బన్: అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : స్థానిక మూడురోడ్ల కూడలిలో దేశ ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు వేడుకలను బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు జయచంద్ర నాయుడు, మద్దుల రామచంద్రయ్య, గంగయ్య, కె.రెడ్డన్న, శ్రీనివాసులు, భోజనగురు ఆదినారాయణ, గురుస్వామి, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, నారాయణ తదితరులు పాల్గొని స్వీట్లు పంచుకొని ఒకరికొకరు తినిపించుకున్నారు.

పుల్లంపేట : మండలంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలను రైల్వేకోడూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ చెంగల్‌రాజు, రామసుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, పరమేష్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : భారతదేశం మోడీ నాయకత్వంలో అగ్రరాజ్యంగా ఎదుగుతోందని బీజేపీ సీనియర్ నాయకులు అరమాటి శివంగిరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : భారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు వేడుకలు మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచారు. అలాగే టోల్‌గేట్ వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెంగల్‌రాజు, రామసుబ్బారెడ్డి, సుబ్బారావు, చలపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గణనాథుని నిమజ్జనం



సిద్దవటం: ఆకట్టుకున్న పండరి భజనలు



చిట్వేలి: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

సిద్దవటం : మండలం కేంద్రంలోని గాంధీ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మంగళవారం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్వామి విగ్రహాన్ని 11 రోజులపాటు భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. మంగళవారం వినాయక స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కాగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటం, పండరి భజనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో యువతీయువకులు, చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలి సత్తెమ్మ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక వినాయక హోటల్ యజమాని గిరి అన్నదానం చేశారు. స్వామివారి లడ్డూ వేలంపాటలో గట్టుమీదపల్లికి చెందిన శివ రూ. 20 వేలకు దక్కించుకున్నారు. ఎస్ఐ రఘురాం, సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.



సిద్దవటం: ఊరేగింపుగా నిమజ్జనానికి వెళుతున్న గాంధీ వీధి గణేశుడు